ఓం శ్రీ సాయిరాం

# "నేటి యశోద – కరణం సుబ్బమ్మ"

(సంగీత నృత్య నాటకం)

పాత్రలు

| | | |
|---|---|---|
| 1. అక్రూరుడు | : | కంసుని దూత |
| 2. నందుడు | : | గోకులానికి అధిపతి |
| 3. యశోద | : | నందుని భార్య |
| 4. శ్రీకృష్ణుడు | : | అవతార పురుషుడు |
| 5. బలరాముడు | : | శ్రీకృష్ణుని అన్న |
| 6. ఈశ్వరమ్మ | : | భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి మాతృమూర్తి |
| 7. కరణం సుబ్బమ్మ | : | స్వామిని బాలకృష్ణునిగా భావించిన మహాసాధ్వి |
| 8. సత్య | : | బాల బాబా |
| 9. కరణం సుబ్బమ్మగారి తమ్ముడు | | |
| 10. వ్యక్తి | : | స్వామిని ప్రేమించిన బుక్కపట్టణవాసి |
| 11. కొండప్ప | : | స్వామికి విద్య బోధించిన ఉపాధ్యాయుడు |
| 12. స్త్రీ | : | కరణం సుబ్బమ్మగారి ఇంటిలో మనిషి |

నృత్యాలు

| | | |
|---|---|---|
| 1. గోవర్ధనగిరిధర | .... | 10 బాలికలు |
| 2. నీ పేరు తలచినా | .... | 8 బాలికలు |
| 3. పండరి భజన | .... | 9 బాలురు |
| 4. మధురమైన కలగంటిని | .... | 8 ఆలికలు |
| 5. సత్యసాయిని ముద్దుగ పెంచిన | | |

బానర్లు

| | | |
|---|---|---|
| బాలికలు | .... | 7 |
| బాలురు | .... | 2 |

మొత్తం

| | | |
|---|---|---|
| బాలికలు | .... | 45 |
| బాలురు | .... | 11 |

ఓం శ్రీ సాయిరాం

# "నేటి యశోద - కరణం సుబ్బమ్మ"

(సంగీత నృత్య నాటకం)

రచన: యం.ఎస్ ప్రకాశరావు

(నంద గోకులంలో గోపికలు కృష్ణ నామ సంకీర్తన చేస్తూ నృత్యం చేస్తూ ఉంటారు)

పాట : గోవర్ధన గిరిధర గోవింద.. గోవర్ధన గిరిధర గోవింద..
గోకులపాలక పరమానందా... గోకుల పాలక పరమానందా...
శ్రీవత్సాంకిత శ్రీ కౌస్తుభధర భావక భయహర పాహి ముకుంద.....గోవర్ధన
ఆనందామృత వారిధిచేలా అలఖుపరాక్రమ అనుపమలీలా....
శ్రీనందాత్మజ శ్రితజనపాలా శ్రీకరకిసలయ లాలనలోలా
గోవర్ధన గిరిధర గోవింద...
గోకుల పాలక పరమానందా.... గోకుల పాలక పరమానందా...
శ్రీవత్సాంకిత శ్రీ కౌస్తుభధర భావక భయహర పాహి ముకుంద.....గోవర్ధన

అక్రూరుడు : అమ్మా! నందగోకులం ఎంత దూరం తల్లీ?

గోపికలు : (నవ్వుతారు)

అక్రూరుడు : నందగోకులం ఎంత దూరం అంటే నవ్వుతారేం?

గోపికలు : నవ్వక ఏం చేస్తారయ్యా? నందగోకులం లోనే ఉండి ఎంత దూరమని అడిగితే నవ్వరా మరి.

అక్రూరుడు : ఇదే నందగోకులమా? ఎంత చల్లని మాట చెప్పేవమ్మా.
కృష్ణా...వాసుదేవా...నీ పవిత్ర పాదస్పర్శతో అణువణువూ పునీతమైన ఈ వ్రజభూమిలో అడుగుపెట్టే మహద్భాగ్యం ప్రసాదించేవా తండ్రీ!
శ్రీకృష్ణాయ నమోనమ:

గోపిక : మా నల్లనయ్య పేరు కృష్ణుడే. వాసుదేవుడు కాదు. పాపం నీకు తెలియనట్టుంది.

అక్రూరుడు : అన్ని పేర్లూ ఆ కృష్ణపరమాత్మవేనమ్మా.

గోపిక : కృష్ణయ్య పరమాత్మ కాదయ్యా. పసివాడు.

అక్రూరుడు : అలాగేనమ్మా. ఇంత అమాయకులు కనుకనే భగవంతుడు మీకు అంత దగ్గరయ్యాడు. ఇంతకీ నందుని ఇంటికి దారెటమ్మా.

(నంద యశోదలు ప్రవేశిస్తారు)

గోపిక : అదుగో నందుడు యశోదాకృష్ణులతో మా వసంతోత్సవానికి ఇటే వస్తున్నాడు.

(నేపథ్య సంగీతం)

అక్రూరుడు : యశోదానందులకు ఈ అక్రూరుని ప్రణామాలు.

నందుడు : ప్రణామాలు. మహాశయా! మీవంటి సత్పురుషుల రాక మాకు సంతోషదాయకం

అక్రూరుడు : బాల గోపాలుడు నడయాడిన వ్రజభూమిని దర్శించడం మా అదృష్టం కాదా.

నందుడు : తమ ఆగమనానికి కారణం

అక్రూరుడు : తెలియచేస్తాను. అమ్మా యశోదా నీ సుపుత్రుడేడి తల్లీ.

యశోద : నందగోకులమంతా మా వాడిదే ఒకరింట్లో ఆడతాడు, ఇంకొకరింట్లో పాడతాడు. మా కన్నయ్య వేణునాదంతో గోకులమంతా పులకించిపోతుంది. వినిపిస్తాడు తప్ప కనిపించడు. ఎక్కడున్నాడని చెప్పను.

అక్రూరుడు : నిజమే. విశ్వమంతా నిండినవాణ్ణి ఎక్కడున్నాడని చెప్పగలం.

శ్రీకృష్ణుని వేణుగానం వినిపిస్తుంది. అందరూ వింటూ ఉండగా శ్రీకృష్ణుడు ప్రవేశిస్తాడు. కృష్ణుని జూసి పరవశించి అక్రూరుడూ ప్రార్థిస్తాడు)

శ్లోకం : శ్రీనంద గోపాలం నవనీతచోరం
ఆనందసుందర గోపాలబాలం
బృందావనానంద గోపాలబృందం
బృందారకాధీశ నందముకుందం
నందముకుందం నందముకుందం

శ్యామసుందరా! కృష్ణా! కృష్ణా! అని తపిస్తూంటే ఇన్నాళ్ళకు నా మీద దయ కలిగిందా స్వామీ. నీ బాల లీలల్ని చూసే మహాభాగ్యం కల్గి తమ మమతానురాగాల్ని పంచి ఇచ్చిన ఈ యశోదానందులెంత పుణ్యం చేసుకున్నారో.

నందుడు : కృష్ణయ్య మా ఇంట పుట్టడం మా యశోద పూజాఫలం.

యశోద : ఈ నవనీతచోరుడు నా బిడ్డ. పూజాఫలాలు, పూర్వపుణ్యాలు నాకు తెలియవు స్వామీ. పెద్దలు మీకు తెలియదని కాదు. మరీ అంత కళ్ళార్పకుండా చూడకండి మాకన్నయ్యని. దృష్టి తగులుతుంది.

కృష్ణుడు : పోనీ నా దృష్టి అతని మీద పడనీయనా అమ్మా! అక్రూరా! మాటల్లో పడి వచ్చిన పని

మరచిపోయినట్టున్నావు.

అక్రూరుడు : లేదు కృష్ణా! నీ సమ్మోహన రూపం చూడగానే

కృష్ణుడు : కాస్త మరుపు కలిగినట్టుంది. వచ్చిన పనేదో మా నాన్నగారికి మనవి చెయ్యి.

నందుడు : మధుర నుండి వచ్చినట్టున్నారు. ఏదైనా రాచకార్యమా మహాశయా.

అక్రూరుడు : నందా! రాచకార్యమే. శ్రీ కంసరాజన్యులు మధురను దర్శించవలసిందిగా నందకుమారులైన శ్రీకృష్ణ బలరాములకు ఆహ్వానం పంపారు. పంపడమే కాదు. సకల రాచమర్యాదలతో తోడ్కొని రమ్మని నన్ను స్వర్ణ రథమిచ్చి పంపారు.

నందుడు : శ్రీ కంసరాజన్యులు ఆహ్వానించారా?

యశోద : ఆ! ఈ అకాల మమకారానికి కారణం ఏమిటో నాకు భయంగా ఉంది.

అక్రూరుడు : భయపడవలసిన అవసరం లేదు. అందుకే నన్ను పంపారు. మధురానగర వైభవాన్ని చూశాక నేనే తోడ్కొని వస్తానమ్మా.

యశోద : నా బిడ్డను నేను పంపను. దయచేసి తమరు వెళ్ళి రండి. నా కన్నయ్యను ఒక్క క్షణమైనా విడిచి నేనుండలేను.

అక్రూరుడు : ఇది రాజాజ్ఞ తల్లీ

యశోద : అయితే పంపి తీరాలా? నేను పంపను. వారి బిడ్డల్ని పంపడం నందయశోదలకిష్టంలేదని మహారాజుకు మనవి చెయ్యండి.

కృష్ణుడు : అవునమ్మా నాకూ ఇష్టం లేదు. నిన్ను వదిలి నేనుండగలనా

యశోద : వుండలేవు నాన్నా. విన్నారా మా కన్నయ్య ఏమన్నాడో.

అక్రూరుడు : ఆ కన్నయ్య అన్నదే విన్నావు కాని ఆయన మనసులో ఉన్నది తెలుసుకున్నావా యశోదమ్మా

యశోద : నా బిడ్డ మనసంతా నేనే ఉంటాను

అక్రూరుడు : అని నువ్వు భ్రమ పడుతున్నావు

నందుడు : అది భ్రమెందుకవుతుంది. మా కన్నయ్యని మా ప్రాణానికి ప్రాణంగా చూసుకున్నాం.

అక్రూరుడు : ప్రాణానికి ప్రాణంగా చూసుకుని ఉండవచ్చు. మమతానురాగాల్ని పంచి ఉండవచ్చు. ఊయలలో ఊపవచ్చు. అంబారీపై ఊరేగించి ఉండవచ్చు. మణిహారాల్ని కూడా అలంకరించి ఉండవచ్చు. కానీ ఇవేవీ కన్న ప్రేమకు సాటిరావు కదా.

నందుడు : అంటే ఏమిటి మీ అభిప్రాయం

అక్రూరుడు : ఆ కన్నయ్యను కన్న తల్లితండ్రులు మీరనుకుంటున్నారా? కాదు.

యశోద : ఆ మాట అనకండి. నేను భరించలేను.

అక్రూరుడు : కల్పనలు కాదు తల్లీ. ప్రత్యక్ష సత్యాలు. నవమోసాలు మోసి కన్నయ్యని కన్న వెంటనే గుండె రాయి చేసుకొని బంగారం లాంటి బిడ్డను నీ ఒడికి చేర్చి తాను కన్నీరు కారుస్తూ కంసుని కారాగారంలో కటిక నేలపై పరుండి కన్న కొడుకు కోసం "కృష్ణా! కృష్ణా! అని కలవరిస్తోందమ్మా దేవకీదేవి. శృంఖలాబద్ధుడై ఆ తల్లి వేదనను చూడలేక ఓదార్చుతున్నాడమ్మా తండ్రి వసుదేవుడు. ఇప్పుడు చెప్పమ్మా కృష్ణుణ్ణి మధురకు పంపుతావో లేదో.

యశోద : ఇదెక్కడి కథ. నా గుండెని వజ్రాయుధంగా చీల్చుతోంది. పాలిచ్చి, నా శ్వాసలో శ్వాసగా భావించి, నా సర్వస్వం నా కన్నయ్యేనని తలచి పెంచిన నా కన్నయ్య నా బిడ్డ కాడా. స్వామీ మీరు చెప్పండి (నందుడి కాళ్ళ మీద పడుతుంది)

నందుడు : ఊరుకో యశోదా. దైవలీలలు విచిత్రంగా ఉంటాయి. అక్రూరుడి వంటి సజ్జనుడు అసత్యం చెప్పడు. ఈ నిజాన్ని మనం భరించవలసిందే. తప్పదు.

యవోద : కృష్ణయ్యా! ఈ కథ నిజం కాదని, నేనే మీ అమ్మనని నువ్వైనా చెప్పు నాన్నా. నువ్వైనా చెప్పు.

కృష్ణా : అమ్మా! కన్నతల్లి ప్రేమని మించిన అమృత ప్రేమను అందించావు నువ్వు నాకు అమ్మకంటే ఎక్కువ.

యశోద : అమ్మ కంటే ఎక్కువా? అంటే నేను నీ అమ్మను కానట్టేనా? చెప్పు కృష్ణా.

కృష్ణుడు : దేవకీదేవి నా కన్నతల్లి. పెంచిన మమతానుబంధంతో నువ్వు నీ గురించే ఆలోచిస్తున్నావు తప్ప ఆ కన్న తల్లి గుండె కోత గుర్తించావా. నా కోసం నా కళ్ళలో ప్రాణాలు పెట్టుకుని ఎదురు చూస్తున్న ఆ మాతృమూర్తి గురించి కొంచెమైనా ఆలోచించావా. లేదు కదా. ఒక్కమారు ఆలోచించు. నీ కన్నీరు ఆగిపోతుంది. నీ దు:ఖం సమసిపోతుంది. "కృష్ణా! కృష్ణా! అని అహోరాత్రులు తపిస్తున్న ఆ తల్లిని చూడనవసరంలదా అమ్మా!

యవోద : తప్పక చూడాలి కృష్ణా! కానీ నిన్ను చూడకుండా ఒక్క క్షణమైనా కూడా నేనుండలేనే. మరి నేనెలా బ్రతికేది.

అక్రూరుడు : ఇంకా కృష్ణుడు నీ బిడ్డేననే భ్రమలో వున్నావు. బ్రహ్మాండాన్ని బొజ్జలో భరిస్తున్న బ్రహ్మాండనాయకుడమ్మా నీ కృష్ణుడు. ఈ చరాచర సృష్టిని సృష్టించి నడిపిస్తున్న దేవాదిదేవుడమ్మా. సకల జీవరాసులలోను జీవుడై ప్రకాశిస్తున్న ఆదిదేవుడమ్మా. బ్రహ్మాది దేవతలు కనుసన్నలలో మెలిగే సర్వేశ్వరుడు నీ కన్నయ్య అని తెలుసుకో తల్లీ.

నందుడు : మా చిన్న కృష్ణుడు భగవంతుడా?

యశోద : స్వామీ, భగవంతుడు ఎక్కడైనా వెన్న దొంగిలిస్తాడా? ఎన్నడైనా గోవులను కాస్తాడా. ఎప్పుడైనా గోపాలకులతో చేరి అల్లరి చేస్తాడా? ఈ చిలిపి పనుల కన్నయ్యను దేవుడని నమ్మమంటారా?

అక్రూరుడు : అమ్మా యశోదా! ఈ చిలిపి పనులు చూసి గోకులంలో మీ అందరూ ఎంత ఆనందించేరు. ఆ ఆనందాన్ని మరచిపోగలరా? ఆనందమే ఆయన ఆహారమమ్మా. మీకు ఆనందాన్ని అందించడం కోసమే ఆనందనందనుడు గోకులంలో అడుగు పెట్టాడమ్మా.

కృష్ణుడు : నిజమేనమ్మా

యశోద : కృష్ణయ్యా. అందరూ నిన్ను దేవుడంటున్నారు. నిజమేనా? నువ్వు చెప్పు. నువు చెప్పు నాన్న. నమ్ముతాను.

కృష్ణుడు : ఔనమ్మా! మంచిని పెంచడానికి చెడును త్రుంచడానికి నేనే ప్రతియుగంలోనూ అవతరిస్తాను. నన్ను నమ్మినవారికి అభయమిచ్చి ఆశీర్వదిస్తాను. వారి చెయ్యి పట్టుకు నడిపిస్తాను. నన్ను నమ్ము తల్లీ.

యశోద : భగవంతుడు దయామయుడంటారే. మరి నా పట్ల ఇంత నిర్దయ చూపించావెందుకు కన్నయ్యా.

కృష్ణుడు : దానికి కారణం నీవే తల్లీ.

యశోద : నేనా

కృష్ణుడు : అవును నువ్వే. నేను ప్రతీ అవతారంలోనూ నన్ను భగవంతుడనని తెలుసుకునేందుకు భక్తులకు, ప్రజాబాహుళ్యానికి అనేక లీలలు ప్రదర్శిస్తాను. దివ్యానుభూతులు ఇస్తాను. అద్భుతాలు ప్రదర్శిస్తాను. నా లీలలు చూస్తూ, దివ్యానుభూతుల్ని అనుభవిస్తూ కూడా ఎవరు నన్ను భగవంతుడనని తెలుసుకుని విశ్వసించరో వారికి దూరమైపోతాను.

పద్యం :

పసివానిగా నేను పూతనను పరిమార్చ
దైవము నేనని తెలియలేదు.
కాలకూటము నింపు కాళీయ మర్థింప
దైవము నేనని తెలియలేదు.
గోవర్థనమెత్తి గోకులము కాపాడ
దైవము నేనని తెలియలేదు.
పదునాల్గు భువనాలు వదనాన చూపగా
దైవము నేనని తెలియలేదు.
విశ్వమంతటికిని విభుడను నేనని
ఎన్ని లీలలు చూపిన ఎరుగవైతి
వందువలన నేను అందనివానిగా
విడిచిపోవుచుంటి విరులచరిత!

యశోద : కృష్ణా పాహిమాం! ఎన్ని అద్భుతాలు చేసినా, ఎన్ని లీలలు చూపినా నా బిడ్డవనే భావించాను కాని, పసివాడు ఈ పరమాద్భుతాలు ఎలా చేయగలడని ఎన్నడూ ఆలోచించలేదు. నీ నిజ స్వరూపాన్ని తెలుసుకోలేదు. కాని ఇన్నాళ్ళూ ప్రాణాధికంగా ప్రేమించానే మరి ఆ సాన్నిహిత్యమూ మాతృత్వంలోని ఆ మాధుర్యమూ అనుభవించే యోగ్యత ఇంకకన్పించవా స్వామీ!

కృష్ణుడు : భక్తులు చేసిన సేవలు, భగవంతుడు ఎన్నడూ మరచిపోడమ్మా. కలియుగంలో నేనే తిరిగి సత్యసాయిగా అవతరిస్తాను. అప్పుడు కరణం సుబ్బమ్మగా జన్మించి కన్నతల్లి కన్న మిన్నగా నన్ను సేవించి అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తావు. అనేక దివ్యానుభూతులను పొందుతావు. భక్త శిరోమణిగా, అపర యశోదగా కీర్తింపబడతావు. మరణించిన నిన్ను పునర్జీవితురాల్ని చేసి నా స్వహస్తాలతో కన్న కొడుకు కంటె మిన్నగా తులసి తీర్థాన్ని నీకందించి నీవు కోరిన ప్రకారం నా దివ్య మంగళ స్వరూపాన్ని నీ చివరి క్షణంలో దర్శనమిచ్చి నీకు సద్గతిని కల్పిస్తాను.

(నేపథ్య సంగీతం)

పాట : నీ పేరు తలచినా...నీ పదములు తాకినా జన్మ ధన్యమవునమ్మా ఓ ఈశ్వరమ్మా.. -2

భవబంధాలను వీడిభక్తురాలివమ్మా.... ॥నీపేరు॥

రత్నాకర వంశంలో అడుగిడినావు

అష్టమగర్భాన శివుని ముదమార గన్నావు - 2

నీలమైన గోళము నీ ఉదరములో జొచ్చినా...

మంగళవాద్యములు ఇంట వింతరీతి మోగినా... - 2

లీలలెన్నో చూసినా నీ సుతుడని మురిసావు

నీవాడని భ్రమించావు .....నీ పేరు

క.సుబ్బమ్మ : ఈశ్వరమ్మా నా బాలకృష్ణుడేడమ్మా

ఈశ్వరమ్మ : బాలకృష్ణుడా

సుబ్బమ్మ : బాలకృష్ణుడేనమ్మా. సత్యాన్ని ఎప్పుడైనా పరీక్షగా చూశావా. చంద్రబింబంలాంటి ముఖం. శివుని జటాజూటం లాంటి ఆ తలకట్టు...చెరగని చిరునవ్వు. చురుకైన కళ్ళు తేనెలొలికే మాటలు, వేణుగానంలాంటి తీయని పాటలూ వింటూ వుంటే మన సత్యం బాలకృష్ణుడని అనిపించడంలేదూ.

ఈశ్వరనమ్మ : అవును సుబ్బమ్మా! నువ్వు చెపుతుంటే నాకూ అలాగే అనిపిస్తోంది.

సుబ్బమ్మ : అనిపించడం కాదమ్మా. ముమ్మాటికీ నిజం. సత్యాన్ని చూస్తుంటే దివి నుండి దిగి వచ్చిన ఏ దేవుడో పసివాడై మన ఇంటికి నడిచి వచ్చినట్టుంది. ఇంతకీ సత్యమేడమ్మా.

ఈశ్వరమ్మ : మీ ఇంటికి రాలేదా? ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో. కొంచెం చూడు సుబ్బమ్మా.

సుబ్బమ్మ : నువ్వింటికెళ్ళు ఈశ్వరమ్మా నేను వెదకి తీసుకొస్తాన్లే.

(నేపథ్య సంగీతం)

సత్యా నాయనా...సత్యా...సత్యా....

(సుబ్బమ్మ వెదికి అలిసి కూర్చుంటుంది)

సత్య : అమ్మా....

సుబ్బమ్మ : ఏమని పిలిచావు సత్యా. అమ్మా అనా! ఇంకొక్కమారు పిలవరా నాయనా.

సత్య : అమ్మా.

సుబ్బమ్మ : చాలు నాయనా. నీలాంటి బాలకృష్ణుడి చేత అమ్మా అని పిలిపించుకున్నానయ్యా. ఈ జన్మకిది చాలు. నువ్విలా కొండల్లో కోనల్లో తిరిగితే ఎలాగయ్యా. నిన్నెలా కనుక్కోగలం.

సత్య : అలసిపోయావా అమ్మా.

సుబ్బమ్మ : నీకోసం అలసిపోయినా ఆనందంగానే ఉంటుంది. నీ కోసం దోసలు చేశాను. తింటావని పిలిచాను.

సత్య : అమ్మా నా స్నేహితులకో.

సుబ్బమ్మ : నీ స్నేహితులకు కూడానా.

సత్య : నేనెప్పుడైనా వంటరిగా ఏదైనా తినడం చూశావా. స్వార్థం లేదమ్మా నాకు. అందరితో ప్రేమను పంచుకోవడమే నాకలవాటు.

సుబ్బమ్మ : స్నేహితులంటే నీకెంత ప్రేమరా.

సత్య : నేను ప్రేమ పంచడానికే పుట్టానమ్మా.

సుబ్బమ్మ : నిజం సత్యం. మీ వాళ్ళందరినీ పిలువు.

(నేపథ్య సంగీతం – సత్యం పిల్లలందరినీ పిలుస్తాడు. సుబ్బమ్మ పిల్లలందరికీ పంచుతుంది)

పిల్లవాడు : మా అందరికీ చేతికిచ్చి సత్యాకి మాత్రం నువ్వే తినిపించావెందుకమ్మా.

సుబ్బమ్మ : మీ అందరికీ ఇవ్వగా మిగిలిందే పెట్టానయ్యా. మీకివ్వకుండా పెడితే సత్య తింటాడా. మీ అందరంటే సత్యకి ఎంత ప్రేమో చూశారా. వాణ్ణి చూసి మీరూ అన్దర్నీ ప్రేమించండి.

పిల్లలు : అలాగే సుబ్బమ్మగారు

విఠలా హరి విఠలా

విఠలా హరి విఠలా

పాండురంగ విఠలే హరి నారాయణ

పురందర విఠలే హరి నారాయణ

హరి నారాయణా...భజో నారాయణ

సుబ్బమ్మ : సత్యా పిల్లలందరి చేతా పండరి భజనెందుకు చేయిస్తున్నావయ్యా వాళ్ళు పాపం చదువుకోవాలి.

సత్య : అమ్మా...హరేర్నామం హరేర్నామం హరేర్నామైవ కేవలం

కలౌనాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యదా

అని మన ఆర్ష సాహిత్యం చెప్పడం లేదా.

సుబ్బమ్మ : అంటే